క్లుప్తంగా

ఘనంగా శివ జయంతి



కాజులూరులో ప్రతిష్ఠించిన ద్వాదశ జ్యోతిర్లింగాలు

కాజులూరు: మండల కేంద్రమైన కాజులూరులో బుధవారం స్థానిక బ్రహ్మ కుమారీస్ సభ్యులు శివజయంతిని ఘనంగా నిర్వహించారు. కాకినాడ బ్రహ్మ కుమారీస్ సంస్థ నిర్వాహకులు రజనిదీధి ఆధ్వర్యంలో శివాలయం ఆవరణలో శిబిరాలను ఏర్పాటు చేసి ద్వాదశ జ్యోతిర్లింగాలను ప్రతిష్ఠించారు. పరిసర గ్రామాల నుంచి ఆలయ దర్శనానికి వచ్చిన భక్తులు ప్రత్యేక శిబిరంలో శివలింగాలను దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన బ్రహ్మ కుమారీస్ సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా అఖండ దీపారాధన

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లిలో కొలువై యున్న ఛాయా సోమేశ్వర స్వామివారి ఆలయం వద్ద చాగంటి వంశీయులు అఖండ దీపారాధనను వైభవంగా నిర్వహించారు. ఏటా శివరాత్రి పర్వదినం ఉదయం నుంచి మరుసటి రోజు ఉదయం వరకు చాగంటి వంశీయులు గత పది తరాలుగా అఖండ దీపారాధన చేస్తూ వస్తున్నారు. ఈ ఏడాది సైతం రామచంద్రపురానికి చెందిన చాగంటి పట్టాభిరామ వరప్రసాద్, కుటుంబ సభ్యులు అఖండ దీపారాధన చేశారు.

షటిల్ బ్యాడ్మింటన్‌లో సత్తా చాటిన వెటరన్



చాంపియన్ ట్రోఫీతో గోవిందరాజు

మండపేట: పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త చుండ్రు గోవిందరాజు షటిల్ బ్యాట్మింటన్ పోటీల్లో చాంపియన్‌షిప్‌ను సాధించారు. ఫిబ్రవరి 21 నుంచి 25వ తేదీ వరకూ విజయవాడలో జరిగిన ఏపీ మాస్టర్స్ చాంపియన్ షిప్ పోటీల్లో షటిల్ బ్యాట్మింటన్ విభాగంలో చుండ్రు గోవిందరాజు, కృష్ణమూర్తి డబుల్స్ టీమ్ చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకుంది. రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ సీఈవోగా చుండ్రు గోవిందరాజు వ్యవహరిస్తున్నారు. సీనియర్ సిటిజన్ అయిన ఆయనను పట్టణ ప్రజలు అభినందించారు.

ఆధ్యాత్మిక చింతనతో సమస్యలు దూరం

కాజులూరు: ఆధ్యాత్మిక చింతనతో మనిషి మానసిక ప్రశాంతతను పొంది సమస్యలకు దూరంగా ఉండగలుగుతాడని రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మహా శివరాత్రిని పురస్కరంచుకుని మండలంలోని గొల్లపాలెంలో పురాణ ప్రసిద్ధి గాంచిన బాలా త్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వర స్వామి ఆలయాన్ని బుధవారం మంత్రి సందర్శించారు. స్వామివారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. హైందవ పరిరక్షణలో భాగంగా పురాణ ప్రసిద్ధి గాంచిన ఆలయాల ప్రాముఖ్యతలను చాటిచెప్పుకోవలసిన బాధ్యత ప్రతీ భక్తునిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నున్న కాశీ విశ్వనాథం, కోకాహరి, మండల గౌడసంఘం అధ్యక్షుడు అంగర కృష్ణ, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో జ్యోతిర్లింగార్చన



ఆలయంలో ప్రకాశిస్తున్న జ్యోతులు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా పేరొందిన ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో బుధవారం మహా శివరాత్రి పురస్కరించుకుని ఆలయ హోమ పండిట్ ఇంద్రకంటి రామారావు శర్మ ఆధ్వర్యంలో ఆలయ నంది మండపంలో జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని, ఆర్‌జేసీ సుబ్బారావు, డీసీ రమేష్‌బాబు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి

రామచంద్రపురం రూరల్: మహా శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా ద్రాక్షారామ పైడా వెంకట రామకృష్ణయ్య క్రీడా ప్రాంగణంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సినీ సంగీత విభావరి భక్తులను విశేషంగా అలరించింది. రాత్రి 9 గంటల నుంచి తెల్లవారు జామున 4 గంటల వరకు ప్రముఖ సినీ గాయకులు మంగ్లీ, మాళవిక, కృష్ణ చైతన్య, సాయిశిల్ప, వైష్ణవి, మృదుల తమ అమృత గానంతో భక్తులను అలరించారు. నృత్య కళాకారుల అద్భుత ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

నాగేంద్ర హారాయ.. నమఃశ్శివాయ

- శివ నామస్మరణతో మార్మోగిన శైవ క్షేత్రాలు
- ముక్కంటికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు
- పోటెత్తిన భక్తజనం

రాయవరం: హరహర మహాదేవా.. శంభో శంకరా.. ఓం నమఃశ్శివాయ.. శరణుఘోషతో శైవక్షేత్రాలు మార్మోగాయి. సకల పాపాలను హరించి కరుణ కురిపించే భక్త సులభుడు..ఆది మధ్యాంత రహితుడైన పరమశివుడ్ని దర్శించుకునేందుకు బుధవారం వేకువ జామున నాలుగు గంటల నుంచి భక్తులు ఆలయాల్లో బారులు తీరారు. శివ పంచాక్షరీ మంత్రాన్ని జపిస్తూ పూజా కార్యక్రమాల్లో పాల్గొని తరించారు. భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లాయి.



ఏడిద సంగమేశ్వర ఆలయంలో నందిని కొలుస్తున్న భక్తులు

అలరారిన శైవక్షేత్రాలు

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని చారిత్రక శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చారిత్రక శివాలయాలైన సోమేశ్వరంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వర స్వామి ఆలయాన్ని వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. వేకువ జామున నాలుగు గంటల నుంచి భక్తుల తాకిడి ప్రారంభమైంది. సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. ఎస్సై సురేష్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. వెంటూరులోని ఉమా సోమేశ్వర స్వామి, చెల్లూరులోని బాలాత్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వరస్వామి, రాయవరంలోని పార్వతీ సమేత రాజేశ్వరస్వామి, అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి, మాచవరంలోని భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువ జామునుంచే భక్తులు శిరస్నానమాచరించి లింగాకారుడైన రుద్రుడ్ని దర్శించుకునేందుకు బారులు తీరారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆలయాల్లో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మారేడు దళాలతో లక్షపత్రి పూజలను నిర్వహించారు. శివలింగాలకు పలుచోట్ల పంచ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. రాత్రి సమయంలో ఆలయం వద్ద భక్తులు దీపాలను వెలిగించారు. రాత్రి 11 గంటల నుంచి లింగోద్భవ పూజలు చేపట్టారు. సోమేశ్వరం శివాలయంలో వేలాది మందికి అన్న సమారాధన చేపట్టారు. భక్తులు రాత్రి సమయంలో జాగారం చేసేందుకు అనువుగా పలు ఆలయాల వద్ద కోలాటాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. దేవాలయాలను విద్యుద్దీపాలంకరణ చేయడంతో పాటు భారీగా బాణాసంచా కాల్చారు. రాయవరంలో పార్వతీ సమేత రాజేశ్వరస్వామి ఆలయం వద్ద మల్లిడి సుబ్బారెడ్డి, పులగం శ్రీనివాసరెడ్డి సౌజన్యంతో ప్రసాద వితరణ చేశారు.

దారులన్నీ శివయ్య సన్నిధికే..

కపిలేశ్వరపురం: పరమ శివుడు లింగాకారంలో అవతరించిన రోజైన శివరాత్రిని మండపేట నియోజకవర్గంలో అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లోని దారులన్నీ శివయ్య సన్నిధికే అన్నట్టు భక్తులు పోటెత్తారు. కపిలేశ్వరపురం మండలంలోని కోరుమిల్లి, కపిలేశ్వరపురం, తాతపూడి పుష్కర ఘాట్‌లలో పుణ్య గౌతమీ గోదావరిలో స్నానమాచరించారు. వెదురుమూడి, నల్లూరు, కాలేరు, అచ్యుతాపురం గ్రామాల భక్తులు కోరంగి కెనాల్ రేవుల్లోనూ, అంగర, పడమర ఖండ్రి, టేకి, మాచర గ్రామాల్లోని రేవుల్లో భక్తి శ్రద్ధలతో స్నానమాచరించారు. జిల్లాలోని అష్ట సోమేశ్వరాలయాల్లో నాలుగవదిగా పేరొందిన కోరుమిల్లి రాజేశ్వరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయాన్ని జిల్లా నలు మూలల నుంచి తరలి వచ్చిన భక్తులు సందర్శించారు. కపిలేశ్వరపురంలోని అగస్త్యేశ్వర, పాపవినాసేశ్వర, అంగరలోని సుబ్రహ్మణ్యేశ్వర, పడమర ఖండ్రికలోని ఖణ్వలింగేశ్వరస్వామి, త్రయంబకేశ్వరస్వామి, తాతపూడిలోని మల్లేశ్వర స్వామి ఆలయాల్లో మహ శివరాత్రి ప్రత్యేక పూజలను నిర్వహించారు.



సోమేశ్వరస్వామికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు



సోమేశ్వరాలయంలో బారులు తీరిన భక్తులు

కాజులూరు: మహా శివరాత్రి పర్వదినం కావటంతో బుధవారం కాజులూరు మండల గ్రామాల్లోని శివాలయాలు భక్తుల తాకిడితో కిటకిటలాడాయి. మండలంలోని గొల్లపాలెం, కాజులూరు, శీల, దుగ్గుదూరు, కుయ్యేరు, అయితపూడి, పెనుమళ్ల, అండ్రంగి, పల్లిపాలెం, ఉప్పుమిల్లి, కోలంక, జగన్నాథగిరి గ్రామాల్లోని శివాలయాల్లో వేకువ జామునుంచే భక్తులు దర్శనాలకు బారులు తీరారు. దక్షిణ కాశీగా పేరు గాంచిన ద్రాక్షారామ భీమేశ్వరాలయానికి ఎనిమిది దిశలలో ఎనిమిది అష్ట సోమేశ్వరాలయాలు ఉన్నాయి. వాటిలో ప్రధాన దిశ అయిన తూర్పుదిశన కోలంకలో పార్వతీ సమేత ఉమాసోమేశ్వరాలయం, ఈశాన్య దిశన పెనుమళ్ల పార్వతీ సమేత రామలింగేశ్వరాలయం ఉండగా కాజులూరు, శీల గ్రామాల్లోని ఆలయాలు రాముడిచే నిర్మింపబడిన శివాలయాలుగా దశాబ్దాల చరిత్ర కలిగి ఉన్నాయి.

జనసంద్రంగా మారిన కోటిపల్లి

కె.గంగవరం: శివాలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. మండలంలోని కోటిపల్లి పుణ్యక్షేత్రంలో కొలువైన ఛాయా సోమేశ్వర స్వామిని దర్శించుకునేందుకు పలు ప్రాంతాలకు చెందిన భక్తులు పోటెత్తారు. బుధవారం తెల్లవారు జాము నుంచి గౌతమీ గోదావరి వద్ద పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు పోటీ పడ్డారు. ఆలయ అర్చకులు గోదావరి నుంచి తెచ్చిన తీర్థపు బిందెతో స్వామివారికి అభిషేకం నిర్వహించిన అనంతరం దర్శనానికి అనుమతి ఇచ్చారు. పుణ్యస్నానం ఆచరించిన భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు క్యూలైన్లలో గంటల తరబడి వేచియున్నారు. క్యూలైన్లలో భక్తుల కోసం టెంట్లు ఏర్పాటు చేసి తాగునీటి సౌకర్యం కల్పించారు. ఆలయంలో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మహాశివ రాత్రి సందర్భంగా స్వామివారిని రామచంద్రపురం ఆర్డీఓ అఖిల, ఎంపీపీ పంపన నాగమణి, గ్రామాభివృద్ధి చైర్మన్ పప్పుల మసేను వెంకన్న(రేవు శ్రీను) తదితరులు దర్శించుకున్నారు. అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందించారు.

మండపేట: మండపేట, రూరల్ మండలం పరిసర గ్రామాల్లో మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులు వేకువ జామునే శివాలయాల్లో పరమ శివుణ్ని దర్శించుకుని అభిషేకాలు చేశారు. పురాతన దేవాలయాలైన ఏడిద సంగమేశ్వర స్వామి, మండపేట అగస్త్యేశ్వర జనార్దన స్వామి, ద్వారపూడి అయ్యప్ప క్షేత్రం, మండపేట అయ్యప్ప దేవాలయం, కలువపువ్వు సెంటర్ వద్ద శివాలయాల్లో తెల్లవారు జాము నుంచి భక్తులు పూజలు నిర్వహించారు. బధవారం నుంచి అర్ధరాత్రి లింగోద్భవ కాలం వరకూ నిరాటంకంగా దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలమూరు రోడ్డులో వేంచేసి యున్న అయ్యప్పస్వామి దేవాలయం వద్ద పర మశివుని విగ్రహానికి పాలాభిషేకం, జలాభిషేకం నిర్వహించారు. 108 బూరెలతో అభిషేకం చేశారు. ప్రాచీన దేవాలయాల్లో ఒకటైన ఏడిద సంగమేశ్వరస్వామి దేవాలయంలో శాసన సభ్యుడు వేగుళ్ల జోగేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంగం ఆలయానికి భక్తులు వందలాదిగా తరలి వెళ్లి స్వయంవర పార్వతీ సంగమేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.



గొల్లపాలెం శివాలయంలో బారులు తీరిన భక్తులు



విశేష అలంకరణలో కోరుమిల్లిలోని సోమేశ్వరస్వామి



మండపేట అయ్యప్ప ఆలయంలో శివుడిని బూరెలతో అభిషేకిస్తున్న అర్చకుడు

మార్మోగిన పంచాక్షరీ మంత్రం



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో అశ్వద్ధ నారాయణ వృక్షం వద్ద భక్తుల ప్రదక్షిణలు

రామచంద్రపురం రూరల్: ప్రణవ పంచాక్షరీ మంత్రం ఓం నమఃశ్శివాయ స్మరణతో రామచంద్రపురం నియోజకవర్గంలోని శివాలయాలు ప్రతిధ్వనించాయి. పరమ శివునికి అత్యంత ప్రీతికరమైన శివరాత్రిని భక్తులు బుధవారం అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో పుణ్య సప్త గోదావరి నదిలో స్నానమాచరించి స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక అభిషేకాలు చేశారు. లింగోద్భవ సమయం వరకూ ఉపవాసంతో ఈశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. మహాశివరాత్రి పర్వదినాన శివపార్వతుల కల్యాణోత్సవాన్ని కనులారా వీక్షించారు.



ప్రత్యేక అలంకరణలో ఆదివారపుపేట శివ బాలయోగి మహరాజ్

రామచంద్రపురం మండలంలో...

మహాశివరాత్రి పర్వదినాన రామచంద్రపురంలోని పలు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వెల్ల, కుందాలమ్మచెరువు, ఏరుపల్లి, నరసాపురపుపేట, ఓదూరు, యనమదల హసన్‌బాద తదితర గ్రామాలలో గల శివాలయాల్లోనూ, ఆదివారపుపేట శివబాలయోగి మహరాజ్ ఆశ్రమంలో గౌరీ శంకరుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. దక్షిణ కాశీ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామివారి దేవాలయానికి దక్షిణాన ఉన్న దక్షగుండం వద్ద ఘంటాంభికా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని చేసిన ఏర్పాట్లు విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రధాన రహదారి నుంచి ఆలయం వరకు రోడ్డుకు ఇరువైపులా అఖండ దీపారాధనతో పాటు, భారీ శివలింగం ఆకృతుల్లో ఏర్పాటు చేసిన అఖండ దీపారాధన భక్తులను కట్టిపడేసింది.

సత్సంగంతో ఆనందమయ జీవితం



కొత్తపేటలో ఈశ్వరీయ విద్యాలయం మందిరం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ శేషుబాబు దంపతులు

కొత్తపేట: సమాజంలో ప్రతి వ్యక్తి సత్సంగం ద్వారా తమ జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలని స్థానిక ప్రముఖ వైద్యుడు కాశిన గేయానంద శేషుబాబు, ప్రముఖ అంతర్జాతీయ శిల్పి డి.రాజ్‌కుమార్ వుడయార్ అన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం కొత్తపేట శాఖ ఆధ్వర్యంలో శివరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభించారు. ఆ ప్రాంగణాన్ని విశేషంగా అలంకరించారు. బ్రహ్మకుమారి మందిరం ప్రాంగణంలో ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసి శివలింగాన్ని నెలకొల్పారు. ఆ నందన వనంలో శ్రీకృష్ణుడు విగ్రహం, ఆవు దూడ తదితర విగ్రహాలను అలంకరించి, కొత్త అందాలను తీసుకువచ్చారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ శేషుబాబు దంపతులు, శిల్పి రాజ్‌కుమార్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మంచి ఆలోచనలతో, మంచి వ్యక్తులతో, మంచి పనులతో స్నేహం చేయడమే సత్సంగం అని బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సూచనను ప్రతీ ఒక్కరూ పాటించాలన్నారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

దేదీప్యమానం.. కోటి దీపోత్సవం



కోటిపల్లి ఆలయం వద్ద కన్నుల పండువగా దీపాలు

కె.గంగవరం: కోటి దీపారాధన మహోత్సవం కన్నుల పండువగా సాగింది. భక్తులు దీపారాధన మహోత్సవాన్ని తిలకించి పరవశించారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం రాత్రి కోటిపల్లిలోని ఛాయా సోమేశ్వరస్వామి ఆలయ మండపంపై ఉత్సవ కమిటీ చైర్మన్, రామచంద్రపురం ఆర్డీవో అఖిల, రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి మహోత్సవాన్ని ప్రారంభించారు. ఆలయంలో దీపాలు వెలిగించేందుకు భక్తులు పోటీ పడ్డారు. అమలాపురం, రామచంద్రపురం, ద్రాక్షారామ పరిసర ప్రాంత ప్రజలు ఆలయం వద్దకు చేరుకొని దీపాలను చూసేందుకు పోటీ పడ్డారు.

రాష్ట్ర వెటర్నరీ సంఘ ఉపాధ్యక్షురాలిగా అనిత



ఏడీఏ అనితను అభినందిస్తున్న అధికారులు, సిబ్బంది

ఆలమూరు: రాష్ట్ర పశుసంవర్ధక శాఖ అధికారుల సర్వీస్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలిగా ఆలమూరుకు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకురాలు ఏడీఏ ఎల్.అనిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడ లబ్బీపేటలోని ఎన్టీఆర్ వెటర్నరీ సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రి ఆవరణలో రాష్ట్ర యానిమల్ హస్బెండరీ ఆఫీసర్స్ సర్వీస్ అసోసియేషన్ (ఏపీఏహెచ్ఓఎస్ఏ) జరిగిన నూతన కార్యవర్గం సమావేశంలో ఈ ఏకగ్రీవ ఎన్నిక జరిగింది. ఏడీఈ అనితను బుధవారం ఆమె నివాసంలో పలువురు పశుసంవర్ధకశాఖ అధికారులు, సిబ్బందితో పాటు ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలియజేశారు.

ఓటరు తీర్పుకు వేళాయె

- నేడు పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్
- ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం

రాయవరం: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ స్థానం కోసం మొత్తం 35 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. మండలంలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే బీఎల్‌వోల ద్వారా ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి చేశారు. పోలింగ్ కేంద్రం సమీపంలో సైతం ఓటరు స్లిప్పులు అందజేసేందుకు రెవెన్యూ శాఖ ఏర్పాట్లు చేసింది. ఓటరు స్లిప్పుతో పాటుగా ఎన్నికల కమిషన్ నిర్దేశించిన 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒక దాన్ని ఓటర్లు తీసుకొని రావాల్సి ఉంటుంది. పోటీచేస్తున్న అభ్యర్థులకు ప్రాధాన్యత క్రమంలో అంకెల ద్వారా ఓటు వేయాల్సి ఉంటుంది.

మండలంలో 1,863 మంది ఓటర్లు

మండల కేంద్రమైన రాయవరంలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయంలో ఒక్కో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మండలంలో ఉన్న మొత్తం 1,863 మంది పట్టభద్ర ఓటర్లలో 1,196 మంది పురుషులు, 667 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఎన్నికలను సక్రమంగా, సజావుగా నిర్వహించేందుకు తగిన పర్యవేక్షణ చేసే నిమిత్తం ఎన్నికల సంఘం మైక్రో అబ్జర్వర్స్‌ను నియమించింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులను మైక్రో అబ్జర్వర్స్‌గా నియమించారు. పోలింగ్ తీరును పరిశీలించి దీనిపై వీరు ఎన్నికల సంఘానికి నివేదికలు అందజేస్తారు.

కేంద్రాలకు చేరిన బ్యాలెట్ బాక్సులు

పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సరళిని పరిశీలించేందుకు రామచంద్రపురం ఆర్డీవో కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి రెండు గంటలకు నమోదైన ఓట్లను తెలుసుకోవడంతో పాటు ఆయా కేంద్రంలో పోలింగ్ జరుగుతున్న విధానం, ఎక్కడైనా శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నమైనదీ లేనిదీ తదితర విషయాలను తెలుసుకుంటారు.

రామచంద్రపురం: నేడు జరిగే ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని 23 పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ మెటీరియల్‌తో సిబ్బంది బుధవారం తరలి వెళ్లారు. స్థానిక వీఎస్ఎం కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి సిబ్బంది సామాగ్రిని తీసుకువెళ్లారు. రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో రామచంద్రపురం మండలం, పట్టణంలో 7 పోలింగ్ కేంద్రాలు, కె.గంగవరం మండలంలో 3, రాయవరం మండలంలో 2, మండపేటలో 8, కపిలేశ్వరపురం మండలంలో 3 పోలింగ్ కేంద్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేడు జరగనుంది. రామచంద్రపురం ఆర్డీవో దేవరకొండ అఖిల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ నేతృత్వంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. నేటి ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది.

కె.గంగవరం: మండల కేంద్రమైన కె.గంగవరం ఉన్నత పాఠశాలలో జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఉన్నత పాఠశాలలో 177, 178 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామని తహసీల్దార్ మృత్యుంజయరావు తెలిపారు. మండల వ్యాప్తంగా 2,035 మంది ఓటర్లు ఉన్నారని నేటి ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని పేర్కొన్నారు.

కపిలేశ్వరపురం: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు తగిన ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తహసీల్దార్ చిన్నారావు బుధవారం చెప్పారు. నిర్వహణా పరమైన వివరాలను వెల్లడించారు. మండలంలో 161,162 పోలింగ్ కేంద్రాలను కపిలేశ్వరపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలోనూ, 163 పోలింగ్ కేంద్రాన్ని మండల పరిషత్ సమావేశ మందిరంలోనూ నిర్వహిస్తున్నామన్నారు. 161వ కేంద్రంలో 266 మంది మహిళలు, 413 మంది పురుషులు వెరసి 679 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. 162వ కేంద్రంలో 172 మంది మహిళలు, 308 మంది పురుషులు మొత్తం 480 మంది, 163వ కేంద్రంలో 164 మంది మహిళలు, 306 మంది పురుషులు మొత్తం 470 మంది ఓటు వేయనున్నారు. మండలంలోని మూడు కేంద్రాల పరిధిలో 602 మంది మహిళలు, 1027 మంది పురుషులు కలిపి మొత్తం 1629 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్టు తహసీల్దార్ తెలిపారు.



వీఎస్ఎం కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించిన ఆర్డీవో అఖిల



పోలింగ్ సామాగ్రితో బయలుదేరుతున్న సిబ్బంది



కపిలేశ్వరపురం ఎన్నికల సిబ్బందితో తహసీల్దార్ చిన్నారావు

మండపేట: ఉభయ గోదావరి పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం జరగనున్నాయి. మండపేట తహసీల్దార్ తేజేశ్వరరావు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండపేటలో 8 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏడిద రోడ్డులో వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనంలో రెండు పోలింగ్ కేంద్రాలు, ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. రూరల్ మండలానికి సంబంధించి పోలీస్‌స్టేషన్ వీధిలో ఉన్న పాలడుగు సత్యవతి జిల్లా పరిషత్ పాఠశాలలో మూడు పోలింగ్ కేంద్రాలు, శ్రీరామ హిందు మున్సిపల్ హైస్కూల్లో ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. మండపేట అర్బన్, రూరల్ మండలాల్లో 4006 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.